# సాక్షి తూర్పుగోదావరి


మంగళవారం । 25 । మార్చి । 2025




**అతి వేగానికి ఇద్దరు యువకుల బలి**

అతి వేగం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌లో మోటార్ సైకిల్‌ను కారు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు.

8లో



**డెల్టాలకు నీటి విడుదల**

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం) | సహర్ బుధవారం (ఉదయం) |
|---|---|---|
| రాజమండ్రి | 6.24 | 4.42 |
| కాకినాడ | 6.24 | 4.42 |
| అమలాపురం | 6.24 | 4.42 |

## న్యూస్‌రీల్

### వడగాడ్పుల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలి



సహాయ కార్మిక కమిషనర్ వలి

రాజమహేంద్రవరం సిటీ: అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించేందుకు జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు తక్షణ చర్యలు చేపట్టాలని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్‌ఎం వలి సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు పరిశ్రమలు, పని ప్రదేశాల్లో కార్మికుల రక్షణకు యాజమాన్యాలు తీసుకోవలసిన చర్యలపై సూచనలు జారీ చేశారు. కష్టతరమైన పనులు చేసే కార్మికులు, పని వారికి పని వేళలను రీషెడ్యూల్ చేయాలి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కార్మికులతో పనులు చేయించరాదు. ఉష్ణోగ్రత తక్కువగా ఉండే సమయానికి కార్మికుల పని గంటలు మార్చాలి. పని ప్రదేశాల్లో కార్మికులందరికీ తగినంత పరిమాణంలో చల్లని, సురక్షితమైన తాగునీరు, అత్యవసర ఐస్ ప్యాక్‌లు, వేడి, అనారోగ్య నివారణ సామగ్రిని అందుబాటులో ఉంచాలి. పని ప్రదేశాల్లో షెల్టర్లు, శీతలీకరణ ప్రాంతాలు, అత్యవసర ఔషధాలు, ద్రవాల వంటివి అందించాలి. వైద్య పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల వల్ల వచ్చే ముప్పు, నివారణ చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించాలి.

### పీజీఆర్ఎస్‌కు 211 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 211 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. వీటిని నిర్ణీత గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో పరిష్కరించాలని ఈ సందర్భంగా జేసీ అన్నారు. ఒకసారి వచ్చిన అర్జీలు తిరిగి రాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల శాఖ ఆధ్వర్యాన ముగ్గురికి క్యంపూటర్లు అందజేశారు.


### పోలీస్ పీజీఆర్ఎస్‌కు 29 ఫిర్యాదులు



ఫిర్యాదీల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 29 మంది ఫిర్యాదులు సమర్పించారు. వారి నుంచి ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఫిర్యాదులు స్వీకరించారు. వెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడారు. ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (శాంతిభద్రతలు) అల్లూరి వెంకట సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

### టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా నగరంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని స్థానిక వై జంక్షన్ వద్ద ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 2023లో 109, ఈ ఏడాది 77 గ్రామ పంచాయతీలు సిల్వర్ మెడల్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. వరుసగా మూడో సంవత్సరం కూడా 77 పంచాయతీలు నామినేషన్‌కు వెళ్తే గోల్డ్ మెడల్ సాధిస్తాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు కూడా ప్రసంగించారు. అనంతరం జిల్లాలోని 106 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు టీబీ ముక్త అవార్డులను జాయింట్ కలెక్టర్, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎన్.వసుధర చేతుల మీదుగా అందజేశారు. తొలుత కలెక్టర్ ప్రశాంతి తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అసలేం జరుగుతోంది..!

- సాధారణ స్థాయిలోనే బలభద్రపురం క్యాన్సర్ కేసులు
- అధికారులు, వైద్య బృందం స్పష్టీకరణ
- ఆందోళన అవసరం లేదన్న వైద్య, ఆరోగ్య మంత్రి
- 38 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు
- 10 మందికి క్యాన్సర్ లేదని నిర్ధారణ
- మిగిలిన వారి రిపోర్టుల కోసం ఎదురు చూపులు
- రక్త పరీక్షలు చేస్తే తెలుస్తుందన్న ఎమ్మెల్యే



బలభద్రపురంలో వైద్యాధికారులను అడిగి పరిస్థితి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే



బలభద్రపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి, రాజమహేంద్రవరం: బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఏం జరుగుతోంది.. నిజంగానే క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో నమోదవుతున్నాయా.. పరిస్థితి అంత ఆందోళనకరంగా ఉందా.. అని ప్రశ్నిస్తే అంత తీవ్రత ఏమీ లేదని అధికార యంత్రాంగం, వైద్య బృందాలు కొట్టిపారేస్తున్నాయి. జాతీయ సగటు గణాంకాలతో పోలిస్తే.. ఇక్కడ నమోదైన కేసులు సాధారణమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా బలభద్రపురంలో క్యాన్సర్ ఆందోళనకర స్థాయిలో లేదని సోమవారం అమరావతిలో ప్రకటించారు. కానీ, స్థానిక అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాత్రం.. వ్యాధి బాధితుల గుర్తింపునకు చేపట్టిన సర్వే పారదర్శకంగా జరగడం లేదని, ఏదో ఒక డేటా తీసుకుని సర్వే చేస్తే ఎలాగని, గ్రామంలో 200కు పైగా కేసులున్నాయని వాదిస్తున్నారు. ఈ అంశాన్ని ఆయన అసెంబ్లీలో ప్రస్తావించడంతో గ్రామంలో మొదలైన ఆందోళన నేటికీ కొనసాగుతోంది. అయితే, అధికార కూటమికి చెందిన ఎమ్మెల్యేనే తమను నమ్మకపోతే ఎలాగని అధికారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇన్నేళ్లుగా స్పందించని ఎమ్మెల్యే.. ఇప్పుడు ఎందుకు అంతగా స్పందించాల్సి వస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద గ్రామంలో మూడు రోజులుగా ఆందోళన కలిగించేలా నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటూండటంతో బలభద్రపురం వాసులు ఆందోళన చెందుతున్నారు.

**ఏం జరిగిందంటే..**

బలభద్రపురంలో క్యాన్సర్ విస్తరణకు కారణాల్ని అధ్యయనం చేయాలంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాల్ని పరిశీలించాలంటూ పర్యావరణ శాఖకు ఎన్నిసార్లు చెప్పినా లెక్క చేయడం లేదని పేర్కొన్నారు. ఆ గ్రామంలో 200 మందికి పైగా క్యాన్సర్ బాధితులున్నారని ఆరోపించారు. అప్పటి నుంచీ ఈ విషయం హాట్‌టాపిక్‌గా మారింది.

**రంగంలోకి దిగిన యంత్రాంగం**

ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు అధికారులు, వైద్య సిబ్బంది రంగంలోకి దిగారు. బలభద్రపురం గ్రామాన్ని మూడు రోజుల పాటు జల్లెడ పట్టారు. ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. గ్రామంలో 3,500 ఇళ్లున్నాయి. జనాభా 10,800. వైద్య బృందాలు ఈ నెల 22, 23 తేదీల్లో 8,830 మందిపై సర్వే చేశారు. ఏకంగా 31 బృందాలు సర్వేలో భాగస్వాములయ్యాయి. వివిధ మార్గాల ద్వారా డేటా తీసుకుని మరీ పరిశీలించారు. చివరకు సర్వేలో 38 మంది అనుమానితులను మాత్రమే గుర్తించారు. వైద్య పరీక్షల అనంతరం వీరిలో 10 మందికి క్యాన్సర్ లేదని నిర్ధారించారు. మిగిలిన వారికి సంబంధించిన వైద్య పరీక్షల నివేదికలు ఇంకా రావాల్సి ఉంది.

**అధికారులపై నిందలు**

అయితే, అధికారులు చెప్పిన లెక్కలు ఎమ్మెల్యే నల్లమిల్లికి మింగుడుపడలేదు. తాను చేసిన ఆరోపణకు ఎలాగైనా బలం చేకూర్చాలనే ఉద్దేశంతో రంగంలోకి దిగారు. సర్వే సక్రమంగా జరగడం లేదని, ఆరోగ్యశ్రీ డేటా తీసుకుని సర్వే చేస్తే ఎలా తెలుస్తుందని అధికారులపై నిందలు వేయడం ప్రారంభించారు. సర్వే పారదర్శకంగా జరగడం లేదన్నారు. పదుల సంఖ్యలో క్యాన్సర్ రోగులను తమ కార్యకర్తలే ఆస్పత్రులకు తీసుకెళ్లారని, అలాంటిది కేసులు లేవంటే ఎలాగని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా అధికారులు మాత్రం తాము చేపట్టిన సర్వేలో భారీ స్థాయిలో కేసులు వెలుగు చూడలేదని బహిర్గతం చేశారు.

**ఎమ్మెల్యే యూటర్న్?**

బలభద్రపురం గ్రామంలో తాను ఆరోపించిన స్థాయిలో క్యాన్సర్ కేసులు లేవని అధికారులు, వైద్య బృందాలు నిర్ధారించడంతో ఎమ్మెల్యే నల్లమిల్లి యూటర్న్ తీసుకున్నారు. తాను అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యకు ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే చేస్తున్నారని సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. తమకు క్యాన్సర్ ఉందని చెప్పడానికి కొంతమంది గ్రామస్తులు ఇష్టపడటం లేదన్నారు. ప్రతి ఇంటి నుంచీ రక్త నమూనాలు సేకరించాలని, తద్వారా సర్వే కొనసాగించాలని కోరారు. గ్రామంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని గ్రామస్తులు చెప్పడంతో తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని సమర్థించుకున్నారు. వైద్య పరీక్షలు చేసి, క్యాన్సర్ లేదని నిర్ధారిస్తే తనకూ సంతోషమేనంటూ మిన్నకుండిపోయారు.

**డైవర్షన్ పాలిటిక్స్**

ఈ మొత్తం ఎపిసోడ్‌పై అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్పందించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారని విమర్శించారు. కొన్నేళ్లుగా గుర్తుకు రాని బలభద్రపురం ప్రజల సమస్యలు ఒక్కసారిగా ఇప్పుడే ఎందుకు గుర్తుకు వచ్చాయో అర్థం కావడం లేదని అన్నారు. దీని వెనుక రాజకీయ ఎత్తుగడ దాగి ఉందని దుయ్యబట్టారు. కాపవరం వద్ద చెత్తతో విద్యుత్ తయారీ కేంద్రం పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం నాంది పలికిందని, మంత్రి నారాయణ సైతం ఇటీవల ఆ స్థలాన్ని పరిశీలించారని గుర్తు చేశారు. ఈ పరిశ్రమకు పెద్ద మొత్తంలో చెత్తను తరలించాల్సి ఉంటుందని, అదే జరిగితే గ్రామం కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారే సూచనలున్నాయని, అందువలన స్థానిక ప్రజలు దీనిని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఇది గ్రహించిన ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే.. తనకు తెలియకుండానే మంత్రి వచ్చి వెళ్లారంటూ సాకులు చెబుతున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకి తెలియకుండా, సమాచారం ఇవ్వకుండా ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నించారు. కేవలం ప్రజా వ్యతిరేకతను దారి మళ్లించేందుకే ప్రజల్లో ఇలాంటి భయాందోళనలు రేకెత్తించి, రాజకీయ లబ్ధి పొందాలని చూడటం దారుణమని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## క్యాన్సర్ కేసులపై ఆందోళన వద్దు

- పరిశ్రమ వల్ల వ్యాధి వ్యాప్తికి ఆధారాల్లేవ్
- కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, రాజమహేంద్రవరం: బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ కేసులపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బలభద్రపురం సచివాలయం-3లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ సగటు ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 30 క్యాన్సర్ కేసులు ఉండటం సాధారణమేని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యకు స్పందిస్తూ జిల్లా అధికార యంత్రాంగం, వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాయన్నారు. దీని ప్రకారం జాతీయ సగటు రేటు కంటే తక్కువగా ఇక్కడ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. క్యాన్సర్ నిపుణులు, సోషల్, ప్రివెంటివ్ మెడిసిన్ నిపుణుల సూచనల ప్రకారం గ్రామస్తుల ఆరోగ్య వివరాలను పరిశీలించి, డేటాను ధ్రువీకరిస్తున్నట్లు చెప్పారు. హోమీబాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల తగిన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల వల్ల క్యాన్సర్ వస్తోందన్న బలమైన ఆధారాలు ఎక్కడా లేవన్నారు. అలాగైతే కొవ్వూరు, రాజమహేంద్రవరంలో సైతం పరిశ్రమలు ఉన్నాయి కదా.. అన్నారు. ఇక్కడి పరిశ్రమల వల్ల క్యాన్సర్ విస్తరిస్తోందన్న వాదన నేపథ్యంలో గ్రామంలో గాలి, జల కాలుష్యంపై నిపుణులతో పరీక్ష చేయిస్తామన్నారు. రానున్న మూడు రోజులు క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు ద్వారా అనుమానిత కేసులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి తదుపరి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ఉన్నత ఆసుపత్రులకు పంపిస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అనుమానం ఉన్న వారి నుంచి మాత్రమే కాకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరి రక్త నమూనాలు సేకరించి, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలని కోరారు. పూణే నుంచి వచ్చే సైంటిస్టులు జల, వాయు కాలుష్యానికి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

# కూటమిలో కుంపటి!

- తెలుగు తమ్ముళ్లకు బీజేపీ ఝలక్
- ఇసుక, మట్టి అక్రమార్కులపై చర్యలకు డిమాండ్
- ఆర్డీఓకు వినతి



ఆర్డీఓ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు నాగేంద్ర తదితరులు

కొవ్వూరు: యథేచ్ఛగా సాగుతున్న ఇసుక, మట్టి, మద్యం అక్రమాలు కూటమి పార్టీల్లో సెగలు పుట్టిస్తున్నాయి. ఈ అక్రమాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారుల నుంచి స్పందన నామమాత్రంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల బల్లిపాడు – చిడిపి గ్రామాల మధ్య మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్లు, లారీల ఫొటోలు, వీడియోలు పంపించినప్పటికీ ఎటువంటి వాహనాలూ దొరకలేదని చేతులు దులుపుకొన్నారు. అలాగే, కొవ్వూరులో డ్రెడ్జింగ్ చేస్తున్న పడవలను, కార్మికులను పట్టుకుని మరీ అప్పగించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతిపత్రం అందజేశారు. దీనిపై కూడా అధికారులు ఏ చర్యలూ తీసుకోలేదు. దేచెర్లలో మట్టి తవ్వకాలు ఇప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడ నిర్దిష్టంగా ఫిర్యాదులు అందిన తవ్వకాల పైనే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అదే ప్రాంతంలో వేర్వేరుచోట్ల ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. నల్లరాతి క్వారీల మాటున లక్షలాది రూపాయల విలువైన ఎర్రమట్టి, రోడ్డు కంకర అక్రమంగా తరలిపోతోంది. అయినప్పటికీ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ అన్ని అంశాల పైనా మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ మరక తమకు అంటకూడదనే ఉద్దేశంతో కూటమిలోని బీజేపీ జాగ్రత్త పడుతోంది. ఇసుక, మట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర సారథ్యంలో నాయకులు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

**అక్రమాలు, అవినీతితో సంబంధం లేదు**

కూటమిలో భాగస్వామిగా ఉన్నామే తప్ప, ఇసుక, మట్టి, మద్యం అమ్మకాలు, అవినీతితో తమ పార్టీ నాయకులకు ఎటువంటి సంబంధమూ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఈ సందర్భంగా అన్నారు. గోదావరి నదిలో నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ చేస్తూంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని నిలదీశారు. కూటమి ప్రభుత్వానికి, దానిలో భాగస్వామిగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏటిగట్టును ఇష్టానుసారం తవ్వేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తాళ్లపూడి మండలంలో తమ పార్టీ నాయకులు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఏటిగట్లు అక్రమంగా తవ్వి, ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1986 మాదిరిగా గోదావరికి వరదలు వస్తే ప్రజల పరిస్థితి ఏమిటన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానాన్ని ఆసరాగా తీసుకుని, గోదావరి నదిలో భారీ యంత్రాలతో డ్రెడ్జింగ్ చేస్తున్నా అధికార యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇసుక అక్రమాలపై కలెక్టర్‌కు నివేదిస్తామని, అధికారులు స్పందించకుంటే పోరాటానికి తమ పార్టీ సిద్ధమని అన్నారు. అధికార టీడీపీ నేతల అవినీతిని టార్గెట్ చేసుకుని కూటమిలోని బీజేపీ ఈ విధంగా బహిరంగ విమర్శలతో, ఝలక్ ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమిలో విభేదాల కుంపటి రాజుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ

- కిలో గరిష్ఠ ధర రూ.290
- దేవరపల్లిలో వేలాన్ని ప్రారంభించిన ఈడీ విశ్వశ్రీ

దేవరపల్లి: పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో 2024-25 పంట కాలానికి గాను పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దేవరపల్లి వేలం కేంద్రంలో కొనుగోళ్లను పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ ప్రారంభించారు. తొలుత వేలం కేంద్రంలో ఆమె పూజలు నిర్వహించి, ఉదయం 10.54 గంటలకు ఈ-వేలం విధానంలో కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. తొలి రోజు ఉత్తర తేలిక నేలల (ఎన్ఎల్ఎస్) పొగాకు 18 బేళ్లతో పాటు, తొర్రేడు ప్రాంతం నుంచి సదరన్ బ్లాక్ సాయిల్ (ఎస్‌బీఎస్) పొగాకు బేళ్లను కూడా రైతులు అమ్మకానికి తీసుకు వచ్చారు. ఎన్ఎల్ఎస్ పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.290, ఎస్‌బీఎస్ పొగాకు రూ.280 చొప్పున పలికాయి. ట్రేడర్లు గత ఏడాది ప్రారంభ ధర కంటే కిలోకు అదనంగా రూ.50 పెంచి మరీ కొనుగోలు చేశారు. 2023-24 సీజన్‌లో కిలో ప్రారంభ ధర రూ.240 పలకగా, అమ్మకాల ముగింపు నాటికి రూ.410కు పెరిగింది. ఈడీ విశ్వశ్రీ అధికారులను అడిగి పొగాకు వేలం విధానం తెలుసుకున్నారు. పొగాకు నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో బోర్డు విస్తరణాధికారి దామోదర్, రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, వేలం కేంద్రం నిర్వహణాధికారి పి.హేమస్మిత, పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాత్రు వీర వెంకట సత్యనారాయణ, గౌరవ సలహాదారు నరహరిశెట్టి రాజేంద్రబాబు, కార్యదర్శి దుద్దుపూడి హరిబాబు, రైతులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, పలువురు మహిళా రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

### 29,695 కిలోల పొగాకు కొనుగోలు

దేవరపల్లి: కొనుగోళ్లు ప్రారంభించిన తొలి రోజైన సోమవారం ఐదు వేలం కేంద్రాల్లో 29,695 కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. వర్జీనియా పొగాకు 28,406 కిలోలు, సదరన్ బ్లాక్ సాయిల్ (ఎస్‌బీఎస్) పొగాకు 1,288 కిలోలు ఉందని వివరించారు. ఐదు వేలం కేంద్రాల కిలో సగటు ధర రూ.289.57 ఉందని చెప్పారు. ఐదు వేలం కేంద్రాల్లో (ఉత్తర తేలిక నేలల (ఎన్ఎల్ఎస్) పొగాకు బేళ్లు 207, ఎస్‌బీఎస్ బేళ్లు 9 వచ్చాయన్నారు. ఐదు కేంద్రాల్లో 17 మంది కొనుగోలుదారులు వేలంలో పాల్గొన్నారని తెలిపారు.

**వేలం కేంద్రాల వారీగా మొదటి రోజు కొనుగోళ్లు**

| వేలం కేంద్రం | బేళ్లు (కిలోలు) | అమ్మకం (కిలోకు రూ.) | గరిష్ఠ/కనిష్ఠ ధరలు (కిలోకు రూ.) |
|---|---|---|---|
| దేవరపల్లి | 27 | 3,738 | 290 |
| జంగారెడ్డిగూడెం-1 | 27 | 3,830 | 290 |
| జంగారెడ్డిగూడెం-2 | 99 | 13,326 | 290 |
| కొయ్యలగూడెం | 36 | 5,012 | 290 |
| గోపాలపురం | 27 | 3,787 | 290 |

# నిర్మలగిరి.. వెలుగుల సిరి

- విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న పుణ్యక్షేత్రం
- వైభవంగా మేరీమాత ఉత్సవాలు



దివ్యబలి పూజ సమర్పిస్తున్న పీఠాధిపతులు



రంగురంగుల విద్యుద్దీప తోరణాల్లో ఫాతిమా టవర్



విద్యుద్దీప కాంతుల్లో నిర్మలగిరి పుణ్యక్షేత్రం



ఆకట్టుకుంటున్న అఖండ దేవాలయం

దేవరపల్లి: గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతుంది. సుమారు 120 ఎకరాల్లో ఎత్తయిన కొండపై విస్తరించిన ఈ పుణ్యక్షేత్రం మేరీమాత ఉత్సవాల సందర్భంగా ధగద్ధగాయమానంగా వెలుగులీనుతూ, భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చీకటి పడితే చాలు.. రంగురంగుల విద్యుద్దీపాలతో ఈ పుణ్యక్షేత్రం ప్రజలకు కనువిందు చేస్తుంది. ఇక్కడి కలవరి కొండపై ఉన్న క్రీస్తు ఆలయం, దిగువన ఉన్న ప్రార్థనా మందిరం, అఖండ దేవాలయం, ప్రధాన ద్వారం వద్ద ఉన్న మరియ తల్లి స్వరూపం, అక్కడే ఉన్న ఫాతిమా టవర్ విద్యుద్దీప తోరణాలతో కొత్త శోభను అద్దుకున్నాయి. ఈ నెల 22న ప్రారంభమైన నిర్మలగిరి మేరీమాత మహోత్సవాలకు ఉమ్మడి ఉభయ గోదావరితో పాటు ఇతర జిల్లాల నుంచి సైతం లక్షలాదిగా భక్తులు, ఫాదర్లు తరలివచ్చి ప్రార్థనలు చేస్తున్నారు. క్రైస్తవులతో పాటు ఇతర మతస్తులు కూడా ఇక్కడకు తరలి రావడం విశేషం. రాత్రి సమయంలో బస్సులు, లారీలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలపై ఇక్కడకు చేరుకుని, మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీప కాంతులను కన్నులారా తిలకించి, ఆనందపరవశులవుతున్నారు. రెండు రోజుల నుంచి భక్తుల రద్దీ పెరిగింది. రాత్రి 8 గంటల నుంచి పుణ్యక్షేత్రం భక్తజన సంద్రమే అవుతోంది. ఉత్సవాల చివరి రోజయిన మంగళవారం భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు రాత్రి పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర, జార్జి ఆంథోనీ స్వామి, సకిలి ప్రకాష్, కరణం ధమన్ కుమార్, గోరంట్ల జ్వానేస్, పిల్లి ఆంథోనీదాస్‌లు పుణ్యక్షేత్రంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పిస్తారని పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ తెలిపారు. ఉత్సవాలు జరుగుతున్న నాలుగు రోజుల్లో సుమారు 10 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సుమారు 6 లక్షల మంది ప్రార్థనలు చేశారని చెబుతున్నారు.

# కోకోకు ఇదే సీజన్

- కోతలో మెళకువలు పాటించాలి
- గింజల గ్రేడింగ్‌తో అధిక ధరలు
- కోనసీమ జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణ



ఐ.పోలవరం: కోకో ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ మార్చి నుంచి మే నెలాఖరు అంటే మూడు నెలలపాటు అధిక దిగుబడులు వస్తాయి. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి ఉంటాయి. కోకో గింజల ధరలు పొందాలంటే విత్తనాల నాణ్యత పెంచాల్సి ఉంది. ఇందుకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని చెబుతున్నారు జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.వి.రమణ (89998 35469). కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్నందున నాణ్యమైన గింజల ఉత్పత్తి చేసేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఆయన మాటల్లోనే..

మన ప్రాంతంలో పండే కోకో గింజలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. ప్రపంచంలో ఘనా దేశం కోకో గింజల నాణ్యతలో ప్రథమస్థానంలో ఉండేది. దానిని ఇప్పుడు మనం అధిగమించాం. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలకు రికార్డు స్థాయిలో రూ.950 నుంచి రూ.1,000 వరకు ధర వచ్చింది. ఇప్పుడు ధర కొంత తగ్గినా మార్కెట్‌లో కేజీ ధర రూ.550 నుంచి రూ.650 వరకు ఉంటోంది. దీని వల్ల ఈ పంట రైతులకు పూర్తిగా లాభదాయకం. పైగా ఇది కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటగా సాగు చేస్తున్నందున రైతుకు అదనపు ఆదాయం వచ్చే పంట. కోకో చెట్టుకు అధికంగా ఆకు రాలుస్తుంది. ఈ కారణంగా రైతుకు రూపాయి పెట్టుబడి లేకుండా మంచి సేంద్రియ ఎరువు పొందే అవకాశముంది. ఇలా బహుళ ప్రయోజనాలు ఉన్న సాగుగా పేరొందిన కోకోలో మంచి దిగుబడి సాధిస్తే రైతులు మరింత లాభాలు పొందే అవకాశముంది. కోకోలో ప్రతి ఏటా రెండు సందర్భాలలో అధిక దిగుబడులు వస్తాయి. ఒకటి సెప్టెంబర్–జనవరి కాగా, రెండవది ఏప్రిల్–జూన్ మాసాలలో వస్తుంది. ఏప్రిల్ – జూన్ మాసాలలో వచ్చే దిగుబడి అధికంగా ఉంటుంది.



నాణ్యమైన కోకో గింజలు

### గింజల గ్రేడింగ్.. నిల్వ చేయడం

ఎండబెట్టిన గింజల నుంచి తప్పలు, ముక్కలు, ముడుచుకు పోయిన గింజలు, రాళ్లు తీసివేసి పాలిథీన్ లైనింగ్ (150–200 గేజు) కలిగిన గోనె సంచులలో నిల్వ చేసుకోవాలి. ఈ సంచులను ఎత్తైన అరుగుల మీద ఉంచాలి.

**కృత్రిమంగా ఎండబెట్టడం**

వర్షాకాలంలో గింజలను ఎండబెట్టటానికి విద్యుత్తు ఓవెన్స్ చాలా ఉపయోగపడతాయి. 72 నుంచి 96 గంటలలో గింజలు ఎండటం పూర్తవుతుంది. నెమ్మదిగా తక్కువ ఉష్ణోగ్రత వద్ద గింజలు ఎండటం వలన నాణ్యత బాగుంటుంది. ఓవెన్లో గింజలను 50–55 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద 8–10 గంటలు మాత్రమే మొదటి 2 రోజులు ఎండబెట్టాలి. తర్వాత 60 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద రోజంతా ఎండబెట్టవచ్చు. ఈ విధంగా 72 నుంచి 96 గంటలలో ఎండడం పూర్తవుతుంది.

### బుట్ట పద్ధతి


ఎండబెట్టిన పద్ధతిలో కోకో గింజలు

**తడిగింజ పరిమాణం** తక్కువగా ఉన్నప్పుడు వెదురు లేదా కేను బుట్టలను పులియబెట్టడానికి వాడుకోవచ్చు. వెదురుబుట్ట లోపలి అంచులను అరటి ఆకులతో కప్పాలి. బుట్ట అడుగుభాగం మాత్రం ఆకులతో కప్పకూడదు. బుట్టను గింజలతో నింపి అరటి ఆకులతో కప్పాలి. దానిపైన కొద్ది బరువును ఉంచాలి. బుట్టను నేలకు తగలకుండా కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉంచడం వలన గింజలకున్న గుజ్జు సులభంగా బుట్ట అడుగు భాగం నుండి కారిపోతుంది. తరువాత బుట్టను గోనె సంచితో కప్పాలి. గింజలను 3వ, 5వ రోజున కలిపి, గోనె సంచితో కప్పాలి. ఆరు రోజులలో పులియడం పూర్తవుతుంది.

**ఎండబెట్టడం:** పులియబెట్టిన గింజలను పల్చగా సిమెంటు గచ్చు మీద గాని, వెదురు చాప మీద గాని 5 – 6 రోజుల వరకు ఎండబెట్టాలి. మధ్యలో గింజలను కలియబెడుతూ ఉండాలి. ఎండిన గింజలలో తేమ 67 శాతం మాత్రమే ఉండేలా చూసుకోవాలి.

### కాయ కోత - మెళకువలు

పసుపుచార వచ్చిన లేదా పక్వానికి వచ్చిన కాయలను పదునైన కత్తితో కోయాలి. అయితే కాయకు ఉండే చిన్న పాటి కాండం (తొడిమ) చెట్టుకు ఉండేటట్టు చూడాలి. కాండంతో కాయ కోస్తే దాని చుట్టూ వచ్చే పూత దెబ్బతింటుంది. కోసిన కాయలను 2 నుంచి 3 రోజులు నిల్వ చేసిన తర్వాత పగుల గొట్టి గింజలు తీయాలి. కాయలను కర్రతో మధ్య భాగంలో బద్దలు కొట్టి, గింజలను గుజ్జుతో సహా వేరు చేయాలి. కాయ మధ్య భాగంలో ఉన్న కాడను, తొక్కను పులియ బెట్టడానికి ముందు తొలగించాలి.



కాయకు ఉండే చిన్న పాటి కాండం (తొడిమ) చెట్టుకు ఉండేటట్టు కోకో కాయ కోత

### కోకో గింజల ప్రాసెసింగ్

**పులియ బెట్టడం:** కోకో గింజలు చుట్టూ వున్న గుజ్జును తొలగించడానికి, మంచి సువాసన, రుచిని కలిగించడానికి పులియ బెట్టడం మంచి పద్ధతి. గింజలలో అమ్లతను 5.5కు తీసుకు రావడం, వగరు, చేదును తగ్గించడానికి, గింజలో మొలకను చంపడానికి, చుట్టూ వున్న పల్చని తొక్కను తొలగించడానికి పులియ బెట్టడం చాలా అవసరం. పెట్టె పద్ధతి, ట్రే పద్ధతి, బుట్ట పద్ధతి ద్వారా కోకో గింజలను పులియబెట్టడం మంచిది.

### పెట్టె పద్ధతి

60 సెం.మీ. ఇన్టు 60 సెం.మీ. ఇన్టు 45 సెం.మీ. సైజు కర్రలతో చేసిన పెట్టెలు అవసరం. కారిన గుజ్జు పోవడానికి, గాలి తగలడానికి పెట్టె కింద రీపర్ బద్దలు నాటాల్సి ఉంది. తడి గింజలను పెట్టెలో దగ్గరగా అమర్చి అరటి ఆకులతో గాని (లేదా) గోనె సంచులతో గాని కప్పాలి. 24 గంటల తరువాత వేరే పెట్టెలోకి మార్చేటప్పుడు గింజలను మళ్లీ కలపాలి. సమానంగా పులవడానికి సరియైన ఉష్ణోగ్రత తేమ, గాలి ఉండేలా చూడడం ఎంతో అవసరం. పెట్టెలో 48 గంటల తరువాత ఉష్ణోగ్రత 42 నుంచి 48 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరుగుతుంది. పులియబెట్టిన 72 గంటల తరువాత గింజలను వేరే పెట్టెలోకి మార్చాలి. ఒక రోజు తరువాత చివరిగా గింజలను మార్చాలి. ఈ విధంగా పులియడానికి 6 రోజులు అవసరమవుతుంది.


పెట్టెలో పులియబెట్టిన కోకో గింజలు



# అతి వేగానికి ఇద్దరు యువకుల బలి

- మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు అక్కడికక్కడే మృతి, మరొకరు ఆసుపత్రిలో..
- కన్నీరు మున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు


సురేష్ (ఫైల్)


హనుమంతు (ఫైల్)


ప్రమాద స్థలిలో మృతి చెందిన సురేష్


ఆసుపత్రిలో మృతి చెందిన హనుమంతు


ప్రమాదానికి కారణమైన కారు

పెరవలి: అతి వేగం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. జాతీయ రహదారిపై పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామానికి చెందిన మాకా సురేష్ (26), నేతల హనుమంతు (26) అన్నవరప్పాడు సెంటర్‌లో మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు వచ్చిన వేగానికి మోటార్ సైకిల్ గాలిలోకి ఎగిరి సుమారు 20 మీటర్ల దూరంలో పడి ఆగిఉన్న మరో కారును ఢీకొట్టి పడిపోయింది. దీంతో మాకా సురేష్ తలకు బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు, మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన వెంటనే పెద్ద శబ్దం రావటంతో సెంటర్‌లో ఉన్న జనం పరుగున వచ్చి పడిపోయిన ఇద్దరిని లేపటానికి ప్రయత్నించారు. వీరిలో మాకా సురేష్‌లో ఎటువంటి కదలిక లేదు. నేతల హనుమంతు కదులుతుండటంతో హైవే అంబులెన్స్‌కు ఫోన్ చేయటంతో వెంటనే వచ్చి తణుకులో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలానికి వచ్చిన సురేష్ తండ్రి వెంకటేశులు, తల్లి కన్నీరు మున్నీరుగా విలపించారు. తీవ్ర గాయాలైన నేతల హనుమంతు తండ్రి ప్రసాద్, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లే సమయానికి కుమారుడు మృతి చెందాడని తెలిసి హతాశులయ్యారు. మాకా వెంకటేశులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రెండు కుటుంబాలకు వీరే ఆధారం**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి కుటుంబీకులు పేదలు. రెండు కుటుంబాలకు వీరే ఆధారం. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు, కుమారులు మృతితో ఇరు కుటుంబాలు తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నాయి. మాకా వెంకటేశులు, భార్య ధనలక్ష్మిలకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు సురేష్. ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేశారు. తల్లి తండ్రులకు సురేష్ ఒక్కడే ఆధారం. అతను ఇలా రోడ్డు ప్రమదంలో మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నేతల హనుమంతు తండ్రి ప్రసాద్, కృష్ణవేణిలకు ముగ్గురు పిల్లలు పుట్టగా హనుమంతు అన్న మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ప్రస్తుతం మృతుడి చెల్లికి వివాహం జరిగింది. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో హనుమంతు మృతిచెందటంతో తల్లితండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. హనుమంతు తెచ్చిన కూలి డబ్బులే ఈ కుటుంబానికి జీవనాధారం కావటంతో తల్లితండ్రులు బిడ్డ పోయాడని ఒకవైపు రోదిస్తూ మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు అంటూ విలపిస్తుంటే చూపరులు కూడ కన్నీటి పర్యంతం అయ్యారు. తల్లితండ్రులు ఇద్దరు భగవంతుడా మీకు ఏమి అన్యాయం చేశాము, ఈ చివరి క్షణాల్లో మమ్మల్ని ఆదుకునేదెవరు, ఒక బిడ్డను ముందు తీసుకెళ్లావు. అది మర్చిపోకముందే రెండవ బిడ్డను తీసుకెళ్లిపోయావా అంటూ హృదయ విదారకంగా విలపించారు.







ప్రియురాలిని, ఆమె తల్లిని హత్య చేసిన

# ప్రియుడి అరెస్టు


శివకుమార్ అరెస్టుకు సంబంధించిన వివరాలు తెలుపుతున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం రూరల్: ప్రియురాలిని, ఆమె తల్లిని హత్యచేసిన ప్రియుడు పల్లి శివకుమార్‌ను బొమ్మూరు పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఆ వివరాలను సోమవారం రాత్రి రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. మృతిచెందిన మహమ్మద్ సల్మా(37), ఆమె కుమార్తె మహమ్మద్ సుమయ్య(16) హుకుంపేట డిబ్లాకులో నివసిస్తున్నారు. సుమయ్య పెళ్లి ఈవెంట్లు చేస్తూ కుటుంబాన్ని పోషించేది. ఈవెంట్లు చేస్తున్న సమయంలో ఈ కేసులో నిందితుడైన శ్రీకాకుళం జిల్లా నందిగాం గ్రామానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న పల్లి శివకుమార్‌తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారింది. పల్లి శివకుమార్ హైదరాబాద్‌లో నివసిస్తూ అక్కడ పనిచేసేవాడు. మృతిచెందిన సుమయ్యకు ఫోన్ చేసే సమయంలో ఆమె ఫోన్ వెయిటింగ్ వస్తే ఆమెను అనుమానిస్తూ, సుమయ్యతో గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో ఆరురోజుల క్రితం శివకుమార్ మృతుల ఇంటికి వచ్చి వాళ్లతో గొడవపడి చంపుతానని బెదిరించాడు. సుమయ్యకు ఇంకెవరితోనో మాట్లాడేందుకు, ఆమె తల్లి సల్మా సహకరిస్తోంది అనే ఉద్దేశంతో శివకుమార్ ఆదివారం ఉదయం 8.00గంటల సమయంలో సుమయ్య, ఆమె తల్లి సల్మాలను వారి ఇంటిలోనే కత్తితో పొడిచి హత్యచేసి ఇంటికి తాళంవేసి పరారయ్యాడు. మృతురాలు మహమ్మద్ సల్మా కుమారుడు మహమ్మద్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య ఆధ్వర్యంలో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి శివకుమార్‌ను కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించి అదుపులోనికి తీసుకుని, బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, సిబ్బందితో వెళ్లి శివకుమార్‌ను అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, ఎస్సై సీహెచ్‌వీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళ దుర్మరణం

అంబాజీపేట: మతిస్థిమితం లేని ఓ మహిళను సోమవారం తెల్లవారుజామున పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గుర్తుతెలియని మహిళ మతిస్థిమితం లేకపోవడంతో అంబాజీపేట మండల పరిసర ప్రాంతాల్లో తిరుగుతోంది. తెల్లవారుజామున ఆమెను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.


### గుండెపోటుతో ఉపాధి మహిళా కూలీ మృతి

అంబాజీపేట: ఉపాధి పనులు చేస్తుండగా మహిళా ఉపాధి కూలీకి గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. ఇసుకపూడికి చెందిన ఉపాధి హామీ కూలి జక్కంశెట్టి విశాలాక్షి (73) సోమవారం ఉపాధి పనులు చేస్తుండగా గుండుపోటుకు గురై తుది శ్వాస విడిచింది. ఆమె మృతదేహానికి ఏపీఓ ఏ.వి.కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కే.గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, ఉపాధి కూలీలు శ్రద్ధాంజలి ఘటించారు.

గోదావరిలో దూకి

# వ్యక్తి ఆత్మహత్య


కలివరపు చాణక్య (ఫైల్)


గోదావరి నుంచి వెలికితీసిన చాణక్య మృతదేహం

కొవ్వూరు: నందమూరు గ్రామానికి చెందిన కలివరపు చాణక్య(36) సోమవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బై పోలార్ అనే వ్యాధితో బాధపడుతున్న చాణక్య ఉదయం ఇంటి నుంచి బయల్దేరి రోడ్డు కం రైలు వంతెన పై నుంచి గోదావరి నదిలో దూకారు. పోలీసులు రెస్క్యూ టీము సహకారంతో నదిలో గాలించారు. ఎరినమ్మ ర్యాంపు సమీపంలో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### గంజాయి సరఫరా చేసే 14మందిపై చర్యలు

జగ్గంపేట: పోలీసు సర్కిల్ పరిధిలో గంజాయి అమ్మకం, సరఫరా దారులుగా అనుమానంతో పట్టుకున్న 14మందిపైపై సస్పెక్ట్ షీట్స్‌ను ఓపెన్ చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు తెలిపారు. జగ్గంపేట పరిసరాలలో బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న నలుగురిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేసినట్లు తెలిపారు.

### పశివేదలలో చోరీ

**ఎనిమిది కాసుల బంగారం, ఐదు కిలోల వెండి అపహరణ**

కొవ్వూరు: పశివేదల గ్రామంలో పావులూరి రమా సుందరి అనే మహిళ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు, ఐదు కిలోల వెండి వస్తువులు అపహరించుకుని పోయారు. ఈమె కుమారుడు మహేష్ శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. రాత్రి ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో శివాలయం వద్ద ఉంటున్న కుమారుడు వద్దకు ఆమె వెళ్లారు. మెస్ డోర్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న ఆభరణాలను అపహరించుకుని పోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి చోరీకి జరిగినట్లు బాధితురాలు గుర్తించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు.

### దొంగతనం కేసులో ఇద్దరికి 11 నెలల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులకు 11 నెలలు జైలు శిక్ష విధిస్తూ ఐదవ ఏజేఎఫ్‌సీఎమ్ మేజిస్ట్రేట్ జి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. గతేడాది స్థానిక తుమ్మలావ సమీపంలోని చర్చి వద్ద నిర్వహిస్తున్న క్రైస్తవ సభలకు వచ్చిన వారు పక్కనే మోటారు సైకిళ్లు పార్కు చేసుకున్నారు. సభలు జరుగుతుండగా పది రోజుల్లో మూడు మోటారు సైకిళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితులు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు సారంగధర మెట్టకు చెందిన కోసూరి వెంకటరమణ, సుబ్బారావు నగర్‌కు చెందిన ఎంపవల్లి లక్ష్మణరావు మోటారు సైకిళ్లు దొంగిలించినట్లు గుర్తించారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. త్రీటౌన్ ఎస్సై వర్రే అప్పారావు, కోర్టు కానిస్టేబుల్ ఎన్.వెంకటేశ్వరరావును ఎస్పీ డి.నరసింహాకిశోర్ అభినందించారు.

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 – 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 15,500 |
| గటగట (వెయ్యి) | 14,500 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 14,500 |
| గటగట (వెయ్యి) | 13,500 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 13,000 – 13,500 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 13,000 – 13,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |